క్లుప్తంగా

పల్లెల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలి

ఎస్‌ఐ పి.రవిబాబు



విప్పర్ల(క్రోసూరు): పల్లెల్లో ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలని, పిల్లల్ని మంచి చదువులు చదివించుకుని, కుటుంబాలు అభివృద్ధి చేసుకోవాలని ఎస్‌ఐ పి.రవిబాబు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని విప్పర్ల గ్రామంలో ఎస్‌ఐ పల్లెనిద్ర చేపట్టారు. గ్రామంలోని ఎస్సీకాలనీలో బస చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీకాలనీ పెద్దలు, యువకులతో ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలైన పల్లె ప్రజలు ఘర్షణల జోలికి వెళ్లకుండా, ఎవరి పని వారు చేసుకుంటూ ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏదైనా సమస్య వస్తే తనను కలిసి చెప్పుకోవచ్చన్నారు. రోడ్డు పక్కగా ఉన్న గ్రామం కావున ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త మనుషులు ఎవరైనా సంచరించినా, ఏదైనా సందేహం వచ్చినా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా రోడ్డు మార్గంలో ప్రమాదాలు జరిగినా, ఇతర ఏమైనా నేరాలు జరిగినా సీసీ కెమెరాలు లేకపోవటంతో నేరం పరిశోధించటం కష్టంగా ఉంటుందని, కానీ ప్రజల సహకారం కావాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య



మృతుడు సురేష్

క్రోసూరు: అచ్చంపేట మండలం చింతపల్లి గ్రామానికి చెందిన యువకుడు గుమ్మడితల సురేష్ (25) క్రోసూరు మార్కెట్‌యార్డు దగ్గర మద్యంలో పురుగుమందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవిబాబు తెలిపిన వివరాలు మేరకు మృతుడు హైదరాబాద్‌లో ఏసీ మెకానిక్‌గా పని చేస్తుంటాడని, గత కొద్దిరోజులుగా అచ్చంపేట మండలంలోని మిట్టపాలెం గ్రామంలో తన పెద్దమ్మ పుల్లమ్మ వద్ద ఉంటూ వివాహం విషయంలో మనస్తాపం చెంది క్రోసూరులో మద్యంలో పురుగు మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహం తరలించినట్లు చెప్పారు.

31న జాబ్ మేళా

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట శ్రీరామ్ ఐటీఐ కాలేజి ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు ఐటీఐ పూర్తయిన అభ్యర్థులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీరామ్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నంబూరు బుజ్జిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో వరుణ్ మోటర్స్, మహీంద్రా పవర్ జనరేటర్స్, కాల్గేట్, న్యోల్స్, అపోలో టైర్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, బయోడేటాతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న బెల్లంకొండ కృష్ణవివేక్ (25) బుధవారం మృతి చెందాడు. పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ తల్లి దేవాలయం సమీపంలో నివసిస్తున్న కృష్ణవివేక్ ఈ నెల 26న సత్తెనపల్లి మండలం వెన్నాదేవి వద్ద ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీ కొట్టి పడిపోయాడు. ఘటనా స్థలంలో తీవ్రంగా రక్తస్రావమైంది. హుటాహుటిన క్షతగాత్రుడిని స్థానిక వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు

- గ్రామాలలో విస్తరిస్తున్న గంజాయి వాడకం
- మైనర్లపైనే అధిక ప్రభావం
- అప్రమత్తమవ్వాల్సిన తల్లిదండ్రులు



గతంలో దిడుగు దగ్గర పట్టుకున్న గంజాయి ప్యాకెట్లు

అమరావతి: గంజాయి మాదకద్రవ్యాన్ని వినియోగిస్తున్న వారిలో మైనర్లు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తుంది. చాప కింద నీరులా గంజాయి, మాదక ద్రవ్యాలు ఇప్పుడు పల్లెల్లో సామాన్యుల ఇళ్లలోకి ప్రవేశించాయి.

■ గతంలో సుమారు పది కిలోలకు పైగా గంజాయి రవాణా చేస్తుంటే మండల పరిధిలోని దిడుగు వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే ఇటీవల ధరణికోటలో యువకులు గంజాయి తరలిస్తుండగా పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఈ దాడులలో పట్టుబడ్డ వారంతా దాదాపు 30 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం. ఈ పరిస్థితుల నుంచి బయట పడాలంటే తొలుత జాగ్రత్త పడాల్సింది తల్లిదండ్రులే అని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.



ఇటీవల ధరణికోటలో స్వాధీనం చేసుకున్న గంజాయి

గ్రామాలలోనూ అందుబాటులో...

గ్రామాలలోనూ గంజాయి దొరుకుతుండటంతో యువత అందులో ఉండే మత్తుకు అధికంగా ఆకర్షితులవుతున్నారు. మండలంలోని అత్యధిక గ్రామాలలో గంజాయి అందుబాటులోకి వచ్చింది. రకరకాలుగా రవాణా చేసి యువకులకు అందించి అధికంగా సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాలలో ఊరికి దూరంగా ఉన్న ప్రదేశాలలోని భవనాలలో అలాగే పూర్తికాని జగనన్న కాలనీలలో, రియల్ ఎస్టేట్ వెంచర్‌లలో అమరావతిలో కృష్ణానది ఒడ్డున చట్టు మీద అధికంగా గంజాయి సేవనం.. అది కూడా రాత్రి వేళల్లో జరుగుతుండటంతో ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. మద్యం కంటే గంజాయి తక్కువ రేటుకు వస్తుందనే ఆలోచనతో యువత అధికంగా గంజాయికి అలవాటు పడుతున్నారు. అలాగే ఇటీవల కొత్తగా లిక్విడ్ గంజాయి, గంజాయి సిగరెట్‌లు.. వంటివి అందుబాటులోకి వచ్చాయని వాటిని రూ.50 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

దొంగతనాలు.. అబద్ధాలు

గంజాయికి అలవాటు పడ్డాక, డబ్బు కోసం దొంగతనాలకు పాల్పడడం మొదలు పెడుతున్నారు. గంజాయి తేలిగ్గా దొరకడంతో దానికి అలవాటు పడిన వారు స్నేహితులనూ ఈ ఊబిలోకి దించుతున్నారు. సాధారణంగానే పిల్లల మీద స్నేహితుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీంతో స్నేహితుల కోసం తీసుకుని అలవాటు పడిన వారే ఎక్కువగా ఉంటున్నారు. అమాయకులైన మైనర్లకు అలవాటు చేయడం తేలిక కాబట్టే వ్యాపారులు కూడా వారినే టార్గెట్ చేసుకుంటున్నారు. పది ప్యాకెట్లు అమ్మితే ఒకటి ఉచితంగా ఇస్తామని, రూ.100కు కొని రూ.200కు అమ్ముకోవచ్చని పేద పిల్లలకు ఆశ చూపించి ఈ రొంపిలోకి దింపుతున్నారు. గంజాయికి అలవాటు పడిన వారు ఇంట్లో అబద్ధాలు చెప్పటం, చిన్న చిన్న దొంగతనాలు చేయటం అలవాటు చేసుకుంటున్నారు. ఇంట్లో వీలు కాకపోతే బయట కూడా దొంగతనాలు చేయటానికి వెనుకాడటం లేదు. అలాగే విచక్షణ కోల్పోయి ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో గొడవలకు దిగి కేసులలో ఇరుక్కుని భవిష్యత్ పాడు చేసుకుంటున్నారు.

ఇలా కనిపెట్టవచ్చు...

పిల్లల్లో కనిపించే కొన్ని లక్షణాలను బట్టి వాళ్లు గంజయి తీసుకుంటున్నారని కనిపెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలవాటు పడ్డ వారు చదువు.. పని.. దేని మీద శ్రద్ధ పెట్టలేరని, నీరసంగా మత్తుగా ఉండడం, తిండి సరిగా తినకపోవడం, బరువు తగ్గడం, శుభ్రత పాటించకపోవడం, అతిగా నిద్రపోవడం, చిన్న, చిన్న విషయాలకు చిరాకుపడడం, ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం, మాటలకు చేతలకు పోలిక లేకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి లక్షణాలను సునిశితంగా పరిశీలించి వైద్య చికిత్స అందించాలని నిపుణులు సూచిస్తున్నారు.

పిల్లల కదలికలపై శ్రద్ధ పెట్టాలి

చదువుకుంటున్న పిల్లలు గంజాయికి అలవాటు పడి, పలు అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొని విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల కదలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పిల్లలను గంజాయి బారిన పడకుండా చూసుకోవాలి. ఎవరైనా వారిని అలవాటుకు ఉసిగొల్పినా, అలాగే గంజాయి విక్రయిస్తున్నారనే అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం అందించాలి.

– అచ్చియ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, అమరావతి

రేషన్ పంపిణీలో నిబంధనలు పాటించాలి

తహసీల్దార్ డానియేల్



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ డానియేల్

అమరావతి: మండల పరిధిలోని రేషన్ డీలర్లందరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ డానియేల్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల వద్దే రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. డీలర్లు ఈ పాస్, కాటా మిషన్ సక్రమంగా పని చేస్తుంది లేనిదీ పరిశీలించుకోవాలన్నారు. ప్రతి రేషన్ షాపులో స్టాక్ బోర్డ్ కచ్చితంగా పెట్టాలని, షాప్ పరిధిలో 65 సంవత్సరాలు పై బడిన వారికి, వికలాంగుల జాబితా తీసుకొని వారికి 1వ తేదీ నుంచి 5వ తేదీ లోపు సరుకులు వారి ఇంటి వద్దే ఇవ్వాలన్నారు. రేషన్ షాప్ నీట్‌గా ఉంచుకుని సరుకులు పాడవకుండా చూడాలన్నారు. డీలర్లు స్టాక్‌లో తేడాలు లేకుండా చూసుకోవాలని, స్టాక్ బోర్డ్‌లో ముగింపు నిల్వలు నమోదు చేయాలన్నారు. ప్రతీ డీలరు 1వ తేదీ నుంచి 15 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 వరకు షాపు తెరిచి ఉంచి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. పని దినాలలో షాపును మూసి ఉంచితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి డీలరు ఆథరైజేషన్, కాటా స్టాంప్ రశీదు షాపులో ఉంచుకుని అధికారులకు తనిఖీ సమయంలో చూపించాలన్నారు. షాప్‌లో 2 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సరుకుల పంపిణీలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకూడదన్నారు. కోవిడ్ విస్తరిస్తునందున మాస్క్ ధరించడం, గుంపులుగా కార్డు దారులు ఉండకుండా దూరం పాటించి వారు కూడా విధిగా మాస్క్ లు ధరించేలా చూడా లన్నారు. ప్రతి రేషన్ షాపులో మంచి నీటి సదుపాయం, కార్డుదారులు కూర్చునేందుకు సీట్లు ఏర్పాటు చేయాలన్నారు. బియ్యం ఉచితంగా ఇవ్వాలని మిగిలిన సరుకులు ప్రభుత్వ ధరలకే విక్రయించాలని సూచించారు. డిజిటల్ చెల్లింపులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కార్డుదారులకు సరుకులు ఇచ్చేటప్పుడు తప్పనిసరిగా రసీదు అందజేయాలన్నారు. డీలర్లు తమ పరిధిలోని కార్డుదారులతో వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసుకోవాలన్నారు. గ్రామాలలో ప్రజలందరికీ దండోరా, మైకుల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కార్డుదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

తహసీల్దార్ అశ్రవున్నీసా బేగం



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బెల్లంకొండ: రేషన్ సరుకులు తీసుకునేందుకు రేషన్ షాప్ వద్దకు వచ్చిన కార్డుదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డీలర్లు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ అశ్రవున్నీసా బేగం తెలిపారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో వివిధ గ్రామాల రేషన్ డీలర్లతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి కార్డుదారులకు రేషన్ షాపు వద్దనే సరుకులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దీనిపై గ్రామాల్లో ప్రతి కార్డుదారుకు తెలిసే విధంగా పబ్లిసిటీ చేయాలని సూచించారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, అదే విధంగా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ డీలర్లు షాపు వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. రేషన్ షాప్ వద్ద మంచినీటి సదుపాయం, కుర్చీలు ఏర్పాటు చేయాలని, పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ప్రతి డీలర్ విధిగా రికార్డుల్లో నమోదు చేసి స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ పవన్‌కుమార్, వివిధ గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

సత్తెనపల్లి: స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి వేడుకలు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకులు కట్ చేశారు. ఎన్టీఆర్ సేవలను పలువురు పార్టీ నేతలు కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నకరికల్లు: మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు జీవితం ఆదర్శనీయమని పలువురు నాయకులు అన్నారు. ఎన్‌టి రామారావు జయంతిని మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సినీ, రాజకీయ రంగాలలో ఎన్టీఆర్ క్రమశిక్షణ, పరిపాలన దక్షతను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో...

ముప్పాళ్ళ: మండల పరిషత్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రత్నం, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.రూపవతి, సిబ్బంది పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



ఏపూరి ఏడుకొండలు

క్రోసూరు: మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన ఏపూరి ఏడుకొండలు వయస్సు 36 సంవత్సరాలు ఈ నెల 24న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని భార్య రాజేశ్వరి ఫిర్యాదు చేయగా బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రవిబాబు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. రాజేశ్వరి తన భర్తకు డ్వాక్రా గ్రూపుకు చెల్లించాల్సిన నగదు రూ.21 వేలు ఇవ్వగా అవి సొంతానికి వాడుకున్నాడు. దీనిపై ఆమె భర్తను నిలదీసిందని, మరుసటి రోజు ఉదయం యథావిధిగా బయటకు వెళ్లి భర్త తిరిగి రాలేదని, చుట్టపక్కల వెతికినా కనబడలేదని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్థాపంతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజుపాలెం: కుటుంబ ఆర్థిక పరిస్థితులు తట్టుకోలేక మనస్థాపంతో వివాహితుడు ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెద నెమలిపురిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుత్తా అనీల్‌కుమార్(27) ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్ కొక్కానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కె.వేణుగోపాల్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

పిన్నెల్లిపై పెట్టిన అక్రమ కేసు విరమించుకోవాలి

వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్

అచ్చంపేట: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సీ కాలనీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టీడీపీ ఆధిపత్యం కోసం జంట హత్యలకు పాల్పడితే ఆ కేసును అన్యాయంగా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలపై మోపడం హేయమైన చర్య అని అన్నారు. హత్య జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే పల్నాడు జిల్లా ఎస్పీ రెండు వర్గాల మధ్య జరిగిన హత్య అని చెప్పారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కుట్రలు, కుతంత్రాలకు తెరలేపుతూ హత్యకు ఎటువంటి సంబంధంలేని పిన్నెల్లి సోదరులపై కేసును బనాయించడం నీచమన్నారు. ఇది ముమ్మాటికీ రెడ్‌బుక్ రాజ్యాంగానికి పరాకాష్ట అని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తమ విధానాన్ని మార్చుకుని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ సభ్యుడు సందెపోగు పున్నారావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ శిఖా తిమోతి, సందెపోగు శ్యాంసన్, క్రోసూరు మండల ఎస్సీ సెల్ నేత జాన్ రిచర్డ్స్, సందెపోగు జోజి, గోపి, మంద దేవరాజు, సందెపోగు బాజీ, కొత్తపల్లి దాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో ఆకస్మిక తనిఖీలు



శ్రీలక్ష్మీ థియేటర్‌లో తనిఖీలలో ఆర్డీఓ రమణకాంతరెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి

సత్తెనపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు సినిమా థియేటర్లలో రెవెన్యూ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి జీవీ రమణకాంతరెడ్డి నేతృత్వంలో తహసీల్దారు కేఎస్ చక్రవర్తితో కూడిన అధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలోని శ్రీనివాస థియేటర్, రైల్వే స్టేషన్‌రోడ్‌లోని శ్రీలక్ష్మీ థియేటర్‌లో తనిఖీలు చేపట్టి లైసెన్స్‌లు, తినుబండారాల విక్రయాల ధరలపై ఆరా తీశారు. మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించి ప్రేక్షకులకు సరిపడా ఉన్నాయా లేవా అని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా థియేటర్ల నిర్వాహకులు షేక్ మొహమ్మద్ సలాం, షేక్ జానీలతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం థియేటర్లు నడవాలని, టికెట్లు అధిక రేట్లకు విక్రయించ వద్దన్నారు. పట్టణంలో మొత్తం నాలుగు సినిమా థియేటర్లు ఉండగా అచ్చంపేట రోడ్‌లోని సాయి కృష్ణ థియేటర్ సాంకేతిక కారణాలతో రెండు రోజులు తాత్కాలికంగా మూతపడగా.. ఈశ్వర్ సాయి థియేటర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా మూసి ఉంది. మిగిలిన రెండు థియేటర్లను క్షుణ్ణంగా పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీస్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు ఉన్నారు.

వెంకటేశ్వర డీటీఎస్ థియేటర్ తనిఖీ

క్రోసూరు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రోసూరు తహసీల్దార్ వి.వి.నాగరాజు, రెవెన్యూ అధికారులు బుధవారం వెంకటేశ్వర డీటీఎస్ సినిమా హాలును తనిఖీ చేశారు. సినిమాహాలు వాతావరణం ఏవిధంగా ఉంది.. సీటింగ్, విద్యుత్ సౌకర్యాలున్నాయా, టాయిలెట్లు పరిశుభ్రంగా ఉన్నాయా, క్యాంటీన్‌లో తినుబండారాల ధరలు ఏవిధంగా ఉన్నాయో పరిశీలించారు. సక్రమంగా థియేటర్ నిర్వహించకుంటే తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. క్యాంటీన్‌లో ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు చేయాలని, టాయిలెట్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



క్రోసూరు వెంకటేశ్వర డీటీఎస్ థియేటర్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్ నాగరాజు

ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ కిట్స్‌తో బహుళ ప్రయోజనాలు



రైతు సేవా కేంద్రంలో విత్తనాలను ప్రదర్శించి ప్రయోజనాలను వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నకరికల్లు: ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానంలో 30 రకాల విత్తనాలను పొలంలో చల్లడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ఎన్‌ఎఫ్ఏ బి.అప్పలరాజు సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానం వలన ప్రయోజనాలను బుధవారం రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రకాల విత్తనాలతో 50 కిట్స్‌ను సిద్ధం చేసి సచివాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. 20 కేజీల కిట్‌లో పప్పు దినుసులు, చిరుధాన్యాలు, నూనెగింజలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, సుగంధద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు.. అన్ని రకాల విత్తనాలు ఉంటాయన్నారు. అన్నిరకాల విత్తనాలు కలగలిపిన ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ కిట్‌ను ప్రధాన పొలంలో వేయడం ద్వారా కలుపు నివారణ జరుగుతుందన్నారు. కూరగాయలు, ఆకుకూరలు కోసుకోవచ్చని.. పశువుల మేతగా వాడుకోవచ్చని, మిగిలిన మొక్కలు భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకొని ద్రవ, ఘన జీవామృతం, గ్రోత్ ప్రమోటర్‌లు, అంతరపంటలు వేయడం ద్వారా అధిక దిగుబడులు, అత్యధిక లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏఎస్‌లు వై.ప్రభాకర్, షేక్.సుభాని, మాస్టర్ ట్రైనర్ బాజిబాబు, మోడల్ మేకర్ హసీనా, యూనిట్ ఇన్‌చార్జి సునీల్, ఐసీఆర్‌పీలు మల్లిఖార్జున, కొండలు, లక్ష్మి, విజయలక్ష్మి, వర్ధన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

వీధి నాటకాల ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

సత్తెనపల్లి: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కళాజాత బృందం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కళాజాత బృందాల ద్వారా అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. దీనిలో భాగంగా గాయత్రి కల్చరల్ సొసైటీ కళాజాత బృందం పట్టణంలోని తాలూక సెంటర్‌లో వీధి నాటకాల ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ఎలా వస్తుంది.. రాకుండా ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల చిన్న చూపు లేకుండా కలిసి జీవించడం, హెచ్‌ఐవి, హెచ్‌ఐవీ ఉన్న గర్భిణి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ యాక్ట్–2017 గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ పరీక్ష అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా చేస్తారని, వ్యాధి ఉన్న వారు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు వాడినట్లయితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని, సీడీ–4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక టార్గెట్ ఇంటర్వెన్షన్ ఎన్‌జీఓ హాండ్స్ ఆఫ్ కంపాషన్ సిబ్బంది నాగలక్ష్మి, ఈశ్వర్, జ్యోతి రాణి, ఐసీటీసీ కౌన్సిలర్ రఘునాథ్, ల్యాబ్ టెక్నీషియన్ సుభాని, కళాజాత బృందం ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



రాజుపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మాచర్ల–గుంటూరు రహదారిపై చౌటపాపాయపాలెం సమీపంలోని గంగమ్మతల్లి గుడి వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కొత్త బోధనంకు చెందిన మాజీ విద్యా కమిటీ చైర్మన్ గుడిపాటి మరియదాసు(37) రోడ్డు పక్కన నిలుచుని ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వేణుగోపాల్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

3న రెంటపాళ్లలో ఉప సర్పంచ్ నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణ

- విగ్రహావిష్కరణ విజయవంతంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి

కూటమి నేతల దాడులు, పోలీసుల వేధింపులకు ఉప సర్పంచ్ ఆత్మహత్య



మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి, పక్కన నాయకులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలో కూటమి నేతల దాడులు, పోలీసుల వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో ఆవిష్కరించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి తెలిపారు. సత్తెనపల్లిలోని నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 3న సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో ఉప సర్పంచ్ నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించటం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరుకానున్నారన్నారు. గత సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 2024 జూన్ 4న రెంటపాళ్ల ఉప సర్పంచి కొర్లకుంట నాగమల్లేశ్వరరావును ట్రబుల్ మంగర్స్ బైండోవర్‌లో భాగంగా సత్తెనపల్లి రూరల్ పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు ఉదయం 6 గంటలకు తరలించారన్నారు. మధ్యాహ్నానికి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమికి అనుకూలంగా రావడంతో గమనించిన రెంటపాళ్లలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడులకు దిగారన్నారు. ఇంటికి వెళ్లి తలుపులు కొట్టడంతో ఆయన భార్య నందిని, కుమార్తె యశస్విని మాత్రమే ఇంట్లో ఉన్నారని, కుమార్తె యశస్విని ఫోన్‌లో తండ్రి నాగమల్లేశ్వరరావుతో మాట్లాడుతుండగా అప్పటి సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌ఓ రాజేష్‌కుమార్ ఫోన్ లాక్కొని తక్షణమే గ్రామం విడిచి వెళ్లాలని, లేకుంటే రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపుతానని బెదిరించడంతో మనస్థాపం చెందిన నాగమల్లేశ్వరరావు జూన్ 6న గడ్డి మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడన్నారు. చికిత్స పొందుతూ జూన్ 9న మృతి చెందాడన్నారు. గ్రామానికి నాగమల్లేశ్వరరావు అందించిన సేవలకు గుర్తుగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్ చల్లంచర్ల సాంబశివరావు, నాయకులు షేక్ నాగుర్ మీరాన్, పెండెం బాబురావు, బాసు లింగారెడ్డి, షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, ఎంజేఎం రామలింగారెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కళ్ళం విజయభాస్కరరెడ్డి, ఇందూరి నరసింహారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, రాజారపు శివ నాగేశ్వరరావు, చిలుకా జైపాల్, అచ్యుత శివప్రసాద్, బండి కోటినాగిరెడ్డి, ఘోరా, పెద్దింటి వెంకటేశ్వర్లు, వాకుమళ్ళ చెంచిరెడ్డి, గోపిదేశి శివయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

యోగా అలవాటుగా మార్చుకోవాలి

ఎంపీడీవో శ్రీనివాసనాయక్



బెల్లంకొండ: ప్రతిరోజు యోగా చేయడం అలవాటుగా మార్చుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసనాయక్ తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా మాసోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం గ్రామాల్లో మండల అధికారులు యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నాగిరెడ్డిపాలెం గ్రామంలో తహసీల్దార్ అశ్రవున్నీసా బేగం, ఎస్సై డి.ప్రవీణ్, ఎంపీడీవో శ్రీనివాసనాయక్, ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్ స్థానికులతో యోగాసనాలను వేయించారు. అనంతరం గ్రామంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటగిరి రెడ్డి, మండల నాయకుడు వెన్న సీతారామిరెడ్డి, యోగా టీచర్లు, వివిధ గ్రామాల ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.